# అంతరంగయాత్ర

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA APRIL 2014 - JULY 2014 Rs. 2/- VOL. VIII ISSUE 3

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

## జీవన కళ

('జీవన కళ' అనే మాటను మొట్టమొదటగా బహుశ 1936 లో కృష్ణమూర్తి ఉపయోగించారు. న్యూయార్కులో ఇచ్చిన ఒక ప్రసంగంలో – "మిమ్మల్ని మీరు అర్థంచేసుకోవాలంటే ఈ 'నేను' ను నిర్మించే ప్రక్రియ ఎట్లా జరుగుతున్నది అనే స్పృహ మనకు వుండాలి... ఈ 'నేను' ప్రక్రియను సమాప్తం చేయడమే జీవన కళ" అన్నారు. ఆ తరువాత కూడా అతడి ప్రసంగాలలో రచనలలో ఈ మాట అనేక మార్లు ప్రస్తావించబడింది.)

**ఒకరి ప్రశ్న :** నిజంగా తెలుసుకోవాలనే వుద్దేశ్యంతో మిమ్మల్ని ఈ ప్రశ్న అడుగుతున్నాను. జీవితంలో అత్యంత ప్రధానమైన విషయం మీ దృష్టిలో ఏమిటి ? నేను ఎంతగానో దీనిని గురించి యోచించి చూశాను. జీవితంలో అనేకమైన అంశాలు వున్నాయి. అవన్నీ ముఖ్యమైనవే అని నాకు అనిపిస్తున్నది.

**కృష్ణమూర్తి :** బహుశ జీవనకళకు ఆ స్థానం ఇవ్వాలేమో. ఇక్కడ 'కళ' అనే మాటను ఆ మాటకు గల విశాలమైన అర్థంలో వాడుతున్నాను. జీవితం అంటే అందులో ఎన్ని అసంఖ్యాకమైన అంశాలు వుంటాయంటే, ఏదో ఒక్క అంశాన్ని ఎంచి, ఇదే చాలా ముఖ్యం అని చూపడము అంటే కష్టమే. పైగా అది మనల్ని తికమక పెడుతుంది కూడా. అట్లా ఎంపిక చేయడం, ఆ రకంగా వేరు పరచి చూసే గుణం మనల్ని గందరగోళానికి గురి చేస్తుంది. ఒక అంశాన్ని తీసుకొని ఇదే చాలా ముఖ్యమైనది అని అంటే అప్పుడు తక్కిన అంశాలను తక్కువ స్థానంలో నిలబెట్టినట్లే కదా. జీవిత చలనాన్ని అంతటినీ ఒక సంపూర్ణ ప్రవాహంగా నైనా తీసుకోవాలి – చాలా మందికి ఇట్లా తీసుకోవడం మహా కఠినం. లేదా అంటే అన్ని అంశాలనూ ఇమడ్చుకలిగిన ఒక మూలబీజం వంటి ప్రాథమిక అంశాన్ని తీసుకోవచ్చు. ఇది కనుక మీరు ఆమోదిస్తే ఇక మన సంభాషణను కొనసాగించవచ్చు.

**ప్రశ్నిస్తున్నవారు :** ఏదో ఒక అంశం సమస్త జీవనక్షేత్రాన్నీ ప్రతిఫలిస్తుందని మీరు అంటున్నారా ? అది సాధ్యమేనా ?

**కృష్ణమూర్తి :** బహుశ సాధ్యమే. చాలా మెల్లగా జాగ్రత్తగా ఇందులోకి వెళ్ళి చూద్దాం. మొట్ట మొదటి సంగతి ఏమిటంటే, మన ఇద్దరమూ కలిసి ఇది శోధించాలి; అంతేకాని వెంటనే ఒక తీర్మానానికి రాకూడదు. అటువంటి ముగింపుల్లో లోతు వుండదు. అవి పైపైనే వుండిపోతాయి. ఒక జీవిత కోణాన్ని తీసుకొని మనం ఇద్దరం కలిసి పరిశోధిస్తున్నాం. ఈ అవగాహనను జీవితపు సమస్త క్షేత్రానికీ అన్వయించవచ్చు. శోధించాలను కున్నప్పుడు మనలోని అపోహాలను, వ్యక్తిగత అనుభవాలను, ముందు ముందుగానే ఏర్పరచుకున్న అభిప్రాయాలను వదిలేసుకోవాలి. ఒక వుత్తమ శాస్త్రజ్ఞునిలాగే, మనం సంపాదించుకున్న జ్ఞానవిజ్ఞానాలతో మన మనసుకు మసకలు కమ్మకుండా చూసుకోవాలి. పరిశీలిస్తున్న అంశం వద్దకు ఏ ప్రతిరోధమూ చూపకుండా, తాజాగా సరిక్రొత్తగా రావాలి. ఈ పరిశోధనకు అత్యవసరమైన వాటిలో ఇదొకటి. ఈ పరిశోధన ఒక భావన గురించో, ఏవో కొన్ని తాత్విక సూత్రాలను గురించో కాదు. ఈ పరిశోధన మన మనసుల గురించే. ఇది చాలా ముఖ్యమైన అవసరం అనడంలో ఏమాత్రం సందేహం లేదు. లేకపోతే మన భయాలు, మన ఆశలు, మన సుఖసంతోషాలే ఈ పరిశోధన రంగురూపులను మార్చివేస్తాయి.

**ప్రశ్నిస్తున్నవారు :** మీరు చెప్తున్నది మరీ అసాధ్యంగా వున్నదేమో ? అటువంటి మనసు సాధ్యమా ?

**కృష్ణమూర్తి :** పరిశోధన చేయాలనే తపనా, అందులో గల తీక్షణతా మన మనసును ఏ నీడలూ కప్పివేయకుండా చూస్తుంది. నేను ముందే చెప్పినట్లుగా అసలు ముఖ్యమైన విషయం ఏమిటంటే జీవనకళ. సాధారణంగా మనం గడుపుతున్న నిత్యజీవితం కంటే పూర్తిగా విభిన్నమైన మరో నిత్యజీవితం గడప గలమా ? మామూలుగా జరిగేవన్నీ మీకు తెలుసు. అదుపు ఆజ్ఞలు, సంఘర్షణ, క్రమశిక్షణకు లొంగుబాటు వంటివేవీ లేకుండా గడిపే జీవనమార్గం ఏదైనా వున్నదా ? ఇది నేనెట్లా కనిపెట్టాలి ? ఇప్పుడు నా సమస్త మానసంలోను ఏమి జరుగుతున్నదో సరిగ్గా దానినే నేను సూటిగా చూడగలిగినప్పుడు అది నేను కనిపెట్టగలుగుతాను. అంటే, ఇప్పుడు ఏమి జరుగుతున్నదో అది నేను పరిశీలించ-గలిగినప్పుడు సంఘర్షణ లేకుండా జీవించగలుగుతాను. ఇది మేధాపరమైన, లేదా మనోద్వేగాలకు సంబంధించిన వ్యవహారం కాదు. ఇది అత్యంత నిశితమైన, సుస్పష్టమైన, సూటియైన గ్రహింపు. ఇందులో ద్వైధీభావం వుండదు. అక్కడ నిజంగా వున్నది మాత్రమే వున్నది. మరేదీ లేదు.

**ప్రశ్నిస్తున్నవారు :** ఈ సందర్భంలో ద్వైధీభావం అంటే మీ అర్థం ఏమిటి ?

**కృష్ణమూర్తి :** జరుగుతున్నదానిలో వ్యతిరిక్తత గానీ పరస్పర వైరుధ్యంగాని లేక పోవడం. "ఉన్నది" నుండి తప్పించుకోవడం జరిగినప్పుడు ద్వైధీభావం పుట్టుకొస్తుంది. ఈ పలాయనమే 'ఉన్నది'కి వ్యతిరేకమైనదానిని సృష్టించి సంఘర్షణకు దారి తీస్తుంది. నిజంగా వున్నదేదో వున్నది. అంతే. మరేమీ లేదు.

### అన్నింటికంటె గొప్ప కళ జీవనకళ

అన్నింటికంటె గొప్ప కళ జీవనకళ. మానవుడు తన చేతితో తయారుచేసిన వాటన్నింటి కంటె, తన మనసులో సృష్టించిన వాటన్నింటి కంటే గొప్పది ఇది. మన గ్రంధాలన్నింటి కంటె, సకలదైవాల కంటే కూడా ఇది గొప్పది. ఈ జీవనకళ ద్వారా మాత్రమే ఒక నవ్య సంస్కృతి ఆవిర్భవించడం సాధ్యమవుతుంది.

**ప్రశ్నిస్తున్నవారు** : అంటే, ఇప్పుడు జరుగుతున్నది ఏదో దానిని పరిశీలిస్తున్నప్పుడు మనసు తన పాత జ్ఞాపకాలను, తన ప్రతిస్పందనలను వెంటబెట్టుకొని రాకూడదు అని మీరు అంటున్నారా ?

**కృష్ణమూర్తి** : అవును. నేను చెప్తున్నది అదే. జరుగుతున్నదాని వద్దకు మనసు తన పాత జ్ఞాపకాలతో, తన ప్రతిస్పందనలతో రావడం అంటే అది మనసు యొక్క నిబద్ధీకరణ అనమాట, ఇప్పుడు జరుగుతున్నదానిని పరిశీలించకుండా ఈ నిబద్ధీకరణవే అడ్డుపడుతున్నది. ఇప్పుడు జరుగుతున్న దానిలో కాలప్రసక్తి లేదు. మన నిబద్ధీకరణకు పరిణామంగా వచ్చినదే కాలం. ఇది మానవుడికి వారసత్వంగా సంక్రమించింది. ఈ బరువుభారానికి మొదలు అంటూ లేదు. జరుగుతున్నదాని ఎడల ఈ గాఢ పరిశీలన వున్నప్పుడు ఆ పరిశీలింపబడుతున్నది కరిగి శూన్యమై పోతుంది. ఇప్పుడు కలుగుతూవున్న, పైకి లేస్తూ వున్న కోపము యొక్క పరిశీలన హింసాతత్వపు సమస్త స్వభావాన్నీ దాని నిర్మాణస్వరూపాన్నీ ఆవిష్కృతం చేస్తుంది. ఈ అంతర్దృష్టి మొత్తం హింసాతత్వాన్ని సమాప్తం చేసివేస్తుంది. దాని స్థానంలో మరి దేనినీ కూర్చోబెట్టదు. ఇక్కడే మనం చిక్కులో బడతాం. ఎందుకంటే మనం కోరుకునేదీ ఆరాట పడేదీ ఒక ఖచ్చితమైన, తిరుగులేనిముగింపు కావాలని. అటువంటి ముగింపులో భద్రత వున్నదని భ్రమ పడతాం.

**ప్రశ్నిస్తున్నవారు** : కోపాన్ని ఈ విధంగా పరిశీలించడం కష్టం అని చాలా మంది అంటారు. ఎందుకంటే మనోద్వేగాలు, ప్రతికూల ప్రతిస్పందనలు ఆ కోపపు గుణంలో విడదీయలేని భాగాలుగా ముడిపడిపోయి వుంటాయి కాబట్టి. ఏ విషయమూ లేకుండా, ఏ పాత జ్ఞాపకాలూ లేకుండా కోపం రావడమనేది జరగదు.

**కృష్ణమూర్తి** : కోపానికి వెనుక చాలా కథలు వున్నాయి. దేనితోనూ సంబంధం లేకుండా ఒక్కసారిగా జరిగే సంఘటన కాదు అది. అనేకానేకమైన పాత జ్ఞాపకాలు అసలైన ప్రత్యక్ష పరిశీలనను ఆటంకపరుస్తాయి. కోపాన్ని తీసుకుంటే, అందులోని విషయమే కోపం; కోపమే అందులోని విషయం. అవి రెండు వేర్వేరు అంశాలు కావు. నిబద్ధీకరణమే ఆ విషయం. ఏమి జరుగుతున్నదో దానిని, అంటే నిబద్ధీకరణపు కార్యకలాపాలను గాఢతతో పరిశీలించడంలో ఆ నిబద్ధీకరణ స్వభావమూ, దాని నిర్మాణ స్వరూపమూ అన్నీ కరిగి పోతాయి.

**ప్రశ్నిస్తున్నవారు** : ఒక సంఘటన జరుగుతున్నప్పుడు వెంటనే మనసులో పాత జ్ఞాపకాల ప్రవాహం పరుగులు పెడుతుందని, ఇది జరగడం ఆరంభమవగానే వెంటనే కనుక మనం చూస్తే, అప్పుడు ఆ పరిశీలన తోనే అదంతా ఆగిపోతుంది, ముగిసిపోతుంది కూడా – అని అంటున్నారా మీరు ? మీరు చెప్తున్నది అదేనా ?

**కృష్ణమూర్తి** : అవును. నిజంగా చూస్తే ఇది చాలా సరళంగా వుంటుంది. ఎంతో తేలిక. అయితే ఆ సారళ్యతను ఆ సూక్ష్మతను మీరు గ్రహించలేక పోతున్నారు. మేము చెప్తున్నది ఏమిటంటే – ఏది జరుగుతున్నా సరే – మీరు నడచివెళుతున్నా, మాట్లాడుతున్నా, ‘ధ్యానిస్తున్నా’ – ఏ సంఘటన జరుగుతుంటే దానిని పరిశీలించాలి. మనసు కనుక అటూ ఇటూ పచారు చేస్తుంటే, ఆ దానినే పరిశీలించడం. ఆ పరిశీలనే మనసు వాగుడును సమాప్తం చేస్తుంది. అందుచేత ఎప్పుడు కాని, ఏ విధమైన పరధ్యాస అనేదీ వుండనే వుండదు.

**ప్రశ్నిస్తున్నవారు** : ఆలోచనల లోపల వున్న విషయం ఏమిటి అన్నదానికి జీవన కళలో బొత్తిగా విలువ లేదు అని మీరు అంటున్నట్లుగా తోస్తున్నది.

**కృష్ణమూర్తి** : అవును. జీవనకళలో జ్ఞాపకాలకు ఏమాత్రం స్థానం లేదు. సంబంధబాంధవ్యాలే జీవనకళ. సంబంధబాంధవ్యాలలో కనుక జ్ఞాపకాలు చోటు చేసుకుంటే అవి బాంధవ్యాలే కావు. పరస్పర సంబంధాలు మనిషికీ మనిషికీ మధ్య వుండాలి. అంతేకాని వారి జ్ఞాపకాల మధ్య కాదు. ఈ స్మృతులే విభజిస్తాయి. అందుచేత విరోధం బయలుదేరుతుంది. ‘నీకు’ ‘నాకు’ మధ్య వ్యతిరేకత మొదలవుతుంది. కాబట్టి, ఆలోచనకు – అంటే అది జ్ఞాపకమే – సంబంధ బాంధవ్యాలలో ఆలోచనకు ఏమాత్రమూ స్థానం లేదు. జీవనకళ అంటే ఇదీ.

పరస్పర సంబంధం అంటే అన్నింటితోనూ. ప్రకృతితో, పక్షులతో, రాయి రప్పలతో – మన చుట్టూ వున్న అన్నింటితోనూ. పైన వున్న మేఘాలతో, నక్షత్రాలతో, ఆ నీలాకాశంతోనూ. ఈ సమస్త అస్తిత్వమూ సంబంధబాంధవ్యమే. అది లేకుండా మనం బ్రతకలేము. ఈ సంబంధబాంధవ్యాలను మనం కలుషితపరచుకున్నాం కాబట్టే కుళ్ళిపోతున్న ఈ సమాజంలో మనం నివసిస్తున్నాం. ఆలోచన ప్రేమను కల్మష పరచకుండా వున్నప్పుడే జీవనకళ – జీవితం కళాత్మకంగా వుంటుంది. మన విద్యాలయాల్లో వుపాధ్యాయులు ఈ కళకు తమను పూర్తిగా అంకితం చేసుకోగలరా ?

**(ఆగస్టు 1 ; 1979)**



## పాల పిట్ట

నీలం రంగులో వుండే ఆ పాలపిట్ట మళ్ళీ తిరిగి వచ్చింది. ఉదయపు ఆహారం తినేశాక ఇక కూర్చుని అరవడం మొదలుపెట్టింది. తన వైపు అందరూ చూడాలని దాని గోల. కాసిని వేరుశనగలు పిట్ట వైపుగా విసిరేశాను. మొదట పిట్ట కాస్త కోప్పడింది. తరువాత నేల మీదికి దిగివచ్చి కొన్ని గింజలు తన ముక్కున కరచుకొని, తిరిగి కొమ్మ మీదకి వెళ్ళి కూర్చుంది. అక్కడి నుండీ ఎగిరి వెళ్ళి పోయింది. మళ్ళీ వచ్చి కూర్చుని అరవడం సాగించింది. రోజులు గడుస్తున్న కొద్దీ క్రమక్రమంగా పిట్ట పెంపుడు పక్షిలా అయిపోయింది. అతి సమీపంలోకి రాసాగింది. మెరుస్తున్న కళ్ళతో, పైకెత్తి పెట్టిన తోకతో; ఒంటి రంగు మెరిసిపోతున్నది. దానిది నిర్మలంగా ప్రకాశిస్తున్న స్వచ్ఛమైన నీలం రంగు. ఆ నీలం ఏ చిత్రకారుని చేతికీ అందదు. తక్కిన పక్షులన్నింటినీ కోప్పడుతూ అరుస్తున్నది పాలపిట్ట. బహుశ తన సామ్రాజ్యంలో ఎవరూ చొరబడకూడదు అనేమో ఆ అరుపులు. అయితే ఎవరూ రాకుండా ఎందుకుంటారు. కొంత సేపటికి ఇతర పక్షులు కొన్ని ఎగురుతూ వచ్చాయి. ఈ పక్షులన్నింటికీ వేరుశనగలన్నా, ఎండు ద్రాక్షలన్నా ఇష్టంలా వుంది.

బ్రతుకు అనే కార్యకలాపం అంతా అక్కడ మహా చురుగ్గా సాగిపోతున్నది.

సూర్యుడు ఆకాశంలో బాగా పైకి ఎక్కి వచ్చాడు. నీడలు అంతగా లేవు. బహు తక్కువ. అయితే సాయంత్రం అయిందంటే పొడవైన నీడలు పరచుకుంటాయి. వివిధ ఆకారాల్లో, చెక్కిన శిల్పాల్లాగా నల్లగా వుండి నవ్వుతుంటాయి.

**(‘కృష్ణమూర్తి టు హిమ్‌సెల్ఫ్’ నుండి ; పుట 78)**

# తనను తాను తెలుసుకోవడంలో గతపు బరువుభారాలనుండి విముక్తి లభిస్తుంది

తనను గురించి తాను తెలుసుకోవడం చాలా ముఖ్యం అని నేనో మరెవరైనానో చెప్పారు కాబట్టి మిమ్మల్ని గురించి మీరు తెలుసుకోవడం చాలా ముఖ్యం అని కనుక మీరు అనుకుంటున్నట్లయితే, ఇక మీకూ నాకూ మధ్య ఏ రకమైన సంభాషణా సాగదు. అయితే, మనలను మనంసంపూర్తిగా అర్థం చేసుకోవడం చాలా అత్యంత ప్రధానమైనదని మీరు అంగీకరించి. నట్లయితే అప్పుడు అందరమూ కలసి ఇది ఏమిటో శోధించవచ్చును. సంతోషంగా, జాగ్రత్తతో, తెలివిగా ఇది మనం విచారణ చేయవచ్చు.

నేను చెప్తున్నదే నమ్మమని మిమ్మల్ని నేను శాసించడం లేదు. ఒక ఆధిపత్య స్థానంలో కూర్చొనీ ఈ మాటలు చెప్పడం లేదు. మీకు బోధన చేయడానికి నా వద్ద ఏమీ లేదు. ఒక కొత్త తత్వసిద్ధాంతం గానీ, ఒక కొత్త విధానం గానీ, యధార్థ తత్వాన్ని చేరడానికి ఒక నూతన మార్గం గానీ నా వద్ద లేవు. సత్యాన్ని చేరడానికి లాగే యధార్థ తత్వాన్ని చేరడానికీ ఒక మార్గం అంటూ లేదు. ఏ రకమైన ఆధిపత్యమైనా సరే, మరీ ముఖ్యంగా ఆలోచనా క్షేత్రంలోనూ, అవగాహనా రంగంలోను మహా విధ్వంసాన్ని సృష్టిస్తుంది. అటువంటి ఆధిపత్యం పరమ దుర్మార్గమైనది. అధిపతులు అనుయాయుల్ని నాశనం చేస్తారు. అనుయాయులు అధిపతుల్ని – నాయకులను నాశనం చేస్తారు. మీరే మీకు గురువులు. మీకు శిష్యులూ మీరే. మానవుడు వేటివేటినైతే విలువైనవనీ, ఆవశ్యకమనీ ఆమోదించాడో వాటి నన్నింటినీ మీరు ప్రశ్నించాలి.

ఎవరో ఒకరిని అనుసరించకపోతే చాలా ఒంటరై పోయినట్లుగా మీకు అనిపిస్తుంది. అప్పుడు అలా ఒంటరిగానే ఉండిపోండి. ఒంటరిగా వుండటానికి భయపడట మెందుకు? ఎందుకు భయపడతారంటే, ఒంటరిగా వున్నప్పుడు మీరు ఏమిటో అది మీ ఎట్టఎదుట నేరుగా నిలబడుతుంది. మీలో వున్నది శూన్యమనీ, మీరు మందకొడిగా మూర్ఖంగా వికారంగా అపరాధభావంలో ఆందోళనలో పడివున్నారనీ – మీరు అనే జీవి ఒక అల్పమైన హీనమైన, నకలు మనిషి అనీ తెలుస్తుంది. ఆ వాస్తవాన్ని సూటిగా చూసుకోండి. పరికించి చూడండి. దాని నుంచి దూరంగా పారిపోకండి. తప్పించుకోవాలని అనుకున్న క్షణమే భయం మొదలవుతుంది.

నాలోకి నేను విచారణ చేస్తుంటే అది తక్కిన ప్రపంచం నుంచి నన్ను నేను విడదీసుకొని ఏకాకిని చేసుకోవడం అవదు. ఇందులో కీడు ఏమీ లేదు. ఈ ప్రపంచంలో మనిషి ఎక్కడుంటున్నా సరే మనలాగే మనలాంటి దైనందిన సమస్యలలోనే చిక్కుకొని పోయి వున్నాడు. అందుచేత మనలోకి మనం శోధించుకుంటున్నామంటే అది ఏమాత్రమూ కూడా ఒక మానసికజాడ్యం వంటిది కానే కాదు. ఎందుకంటే వ్యక్తికీ సమష్టికీ మధ్య ఏ రకంగానూ తేడా అనేది లేదు. ఇది అసలు వాస్తవం. నేను ఎలా వున్నానో ఈ ప్రపంచాన్నీ అలా తయారుచేశాను. పూర్తి మొత్తానికీ ఒక భాగానికీ మధ్యన ఒక పెద్ద పోరుకల్పించి అందులో తలమునకలు అవకండి.

నేను అనే ఈ సమస్త స్వీయరంగం ఏమిటో తెలుసుకోవాలి. దాని ఎరుక మనలో కలగాలి. అదే – ఆ రంగమే వ్యక్తి యొక్క చేతనావర్తం. అదే సమాజం యొక్క చేతనావర్తం కూడా. అప్పుడు మాత్రమే – అంటే ఎప్పుడైతే మనసు ఈ వ్యక్తి యొక్క, సమాజం యొక్క చేతనావర్తపు పరిధులను దాటి వెళుతుందో– అప్పుడు మాత్రమే నాకు నేనే ఒక దీపాన్నయి వెలుగు నిచ్చుకోగలుగుతాను. ఎన్నటికీ ఆరిపోని వెలుగు అది.

సరే, మనల్ని మనం అర్థం చేసుకోవాలంటే ఎక్కడ ఆరంభించాలి? నేను వున్నది ఇక్కడ. నన్ను నేను ఎలా అధ్యయనం చేయాలి, ఎలా పరిశీలించాలి, నా లోపల నిజంగా ఏం జరుగుతున్నదో ఎలా చూడాలి ? సంబంధ బాంధవ్యాలలోనే నన్ను నేను పరిశీలించుకోగలుగుతాను. ఎందుకంటే జీవితం అంటే సంబంధ బాంధవ్యాలే. ఏదో ఒక మూలన కూర్చొని నా గురించి నేను ధ్యానం చేస్తే లాభం లేదు. నా అంతట నేను బ్రతకడం అనేది అసాధ్యం. మనుష్యులతో, వస్తువులతో, విషయాలతో గల పరస్పర సంబంధాలలోనే నేను జీవిస్తాను. బాహ్య విషయాలతోను, మనుష్యులతోనే కాకుండా అంతర్గతమైన విషయాలతో నాకు గల సంబంధ బాంధవ్యాలను అధ్యయనం చేయడం ద్వారా నన్ను నేను అవగాహన చేసుకోవడం ఆరంభిస్తాను. తక్కిన అవగాహనలు అన్నీ కూడా కేవలం ఊహాత్మకమైనవి. ఊహల ద్వారా, నైరూప్యాల ద్వారా నన్ను నేను అధ్యయనం చేసుకోలేను. నేను వట్టి ఊహాత్మకమైన సత్వాన్ని కాను కదా. నేను ఎలా ఉన్నానో దానిని అధ్యయనం చేయాలి తప్ప, ఎలా వుంటే బాగుంటుందని అనుకుంటానో దానిని కాదు.

అవగాహన చేసుకోవడం మేధా సంబంధమైన ప్రక్రియ కాదు. తనను గురించి తాను సమాచారం పోగుచేసుకోవడం వేరు, తనను గురించి తాను అధ్యయనం చేయడం వేరు. అవి రెండూ విభిన్నమైనవి. నిన్ను గురించి నీవు పోగుచేసుకున్న సమాచారం ఎప్పుడూ గతానికి సంబంధించినదై వుంటుంది. గతపు భారాన్ని మోస్తున్న మనసు దుఃఖభరితమైన మనసు.

నిన్ను గురించి నీవు నేర్చుకొనడం ఒక భాషను నేర్చుకొనడం వంటిదో, ఒక సాంకేతిక లేక వైజ్ఞానిక అంశం నేర్చుకొనడం వంటిదో కాదు. ఆ విషయాలను నేర్చుకొనడం అంటే ఆ సమాచారాన్ని మీరు పోగుచేసుకోవాలి, వాటిని జ్ఞాపకం పెట్టుకోవాలి. లేకపోతే ప్రతిసారీ మళ్ళీ మొదటినుండి ఆరంభించవలసి వస్తుంది. అది అర్థంలేని పని. అయితే మానసిక రంగంలో నీ గురించి నీవు నేర్చుకొనడం అనేది ఎప్పుడూ వర్తమానంలోనే జరుగుతుంది. జ్ఞానము – సమాచారము ఎప్పుడూ గతం లోనివే అయివుంటాయి. మనలో చాలామంది గతంలోనే జీవిస్తుంటారు కాబట్టి, గతంతోనే తృప్తపడి పోతుంటారు కాబట్టి, ఈ జ్ఞానం – సమాచారం మనకు చాలా ముఖ్యమై పోయింది. అందుచేతనే పాండిత్యాన్ని, చాతుర్యాన్ని, చాకచక్యాన్ని మనం ఆరాధిస్తుంటాం. అయితే, మీరు కనుక ఎల్లప్పుడూ నేర్చుకుంటూ వుంటే, ప్రతి నిమిషమూ నేర్చుకుంటూ, గమనిస్తూనూ వింటూనూ నేర్చుకుంటుంటే, చూస్తూనూ చేస్తూనూ నేర్చుకుంటుంటే, అప్పుడు నేర్చుకొనడం అనేది ఒక నిరంతర ప్రవాహం అనీ, అందులో గతం వుండదనీ మీరు కనిపెడతారు.

నా గురించి నేను క్రమక్రమంగా నేర్చుకుంటాను; ఎక్కువెక్కువగానో, కొద్దికొద్దిగానో చేరుస్తూ నేర్చుకుంటాను అని కనుక మీరు అంటే అప్పుడు మీరు ప్రస్తుతం ఎలా వున్నారో అది అధ్యయనం చేయడం లేదనమాట. సంపాదించుకున్న సమాచారంతో – జ్ఞానంతో చూస్తున్నారు. నేర్చుకోవడంలో అంతర్లీనంగా గొప్ప సున్నితశీలత వుంటుంది. వర్తమానం పైన అజమాయిషీ చేస్తున్న ఒక భావన – గతంలో నుండి వచ్చిన ఒక భావన వున్నప్పుడు సున్నితశీలత వుండదు. అటువంటప్పుడు మనసు చురుకుగా, మృదువుగా, అప్రమత్తంగా వుండలేదు. మనలో చాలా మందికి శారీరకంగా చూసినా కూడా ఈ సున్నితశీలత లోపిస్తున్నది. అతిగా తినేస్తాం.

సక్రమమైన ఆహారం తీసుకోవాలనే శ్రద్ధ మనకు వుండదు. అతిగా ధూమ్రపానం, అతిగా మద్యపానమూ చేస్తుంటాం. ఆ కారణంగా శరీరాలు మోటుగా తయారై సున్నితశీలత్వాన్ని కోల్పోతాయి. ప్రాణిలో వుండే సావధానతా గుణమే మందగించి పోతుంది. ఈరకంగా ప్రాణి – ఈ దేహి మందకొడిగా భారంగా తయారైనప్పుడు మనసు చాలా అప్రమత్తంగా, సున్నిత శీలతతో సుస్పష్టతతో వుండటం ఎలా సాధ్యమవుతుంది ? వ్యక్తిగతంగా, నన్ను కదలించి వేసే కొన్ని కొన్ని విషయాల్లో మాత్రం నేను సున్నితంగా వుంటానేమో. కానీ జీవితంలో గర్భితంగా వున్న సమస్త విషయాల ఎడల సంపూర్ణమైన సున్నిత శీలతతో వుండాలి అంటే దేహికీ మానసిక తత్వానికీ మధ్యన ఏమాత్రం వేర్పాటు వుండగూడదు.

దేనినైనా అవగాహన చేసుకోవాలంటే దానితో కలసి జీవించాలి. దానిని పరిశీలించాలి. దానిలో వున్న విషయ మంతటినీ, దాని స్వభావనైజాన్నీ దాని ఆకారస్వరూపాన్నీ దాని కదలి కలను తెలుసుకోవాలి. మీరెప్పుడైనా మీతో మీరు కలసి జీవించడనికి ప్రయత్నించారా ? అలా చేస్తే కనుక, మీరు అంటే మార్పుగాని చలనము గాని లేని ఒక జడస్థితి కాదని, ఒక సరిక్రొత్తదైన, సజీవమైన సంగతి అనీ చూడటం మొదలుపెడతారు. ఒక సజీవమైనదానితో జీవించడానికి మీ మనసు కూడా సజీవంగా వుండాలి. మనసు అభిప్రాయాలలో, తప్పొప్పుల, విలువల నిర్ణయాలలో చిక్కుకొని పోయి వుంటే కనుక అప్పుడు మనసుకు సజీవత్వం వుండదు.

మీ మనసు, మీ హృదయాల కదలికలను మీరు పరిశీలించదలుచుకుంటే, మీ సమస్త అస్తిత్వ కదలికలను పరిశీలించ తలచుకుంటే స్వేచ్ఛగల మనసు వుండి తీరాలి. అంగీకరిస్తున్న మనసో ప్రతికూలిస్తున్న మనసోకాదు. వాదవివాదాల్లో ఏదో ఒక పక్షం వహిస్తూ, కేవలం మాటల గురించే కలహిస్తూ వుండే మనసు కాదు. అలా కాకుండా అవగాహన చేసుకోవాలనే దీక్షతో సాగుతున్న మనసై వుండాలి. ఇది చేయడం చాలా కష్టం. ఎందుకంటే మనలో చాలామందికి మన అస్తిత్వం అనే ఈ ప్రాణిని ఎలా చూడాలో తెలియదు. ఎలా వినాలో తెలియదు. నిజానికి ఒక నది సౌందర్యాన్ని ఎలా చూడాలో మనకు తెలియదు. చెట్ల మధ్య నుండి వీస్తున్న వాయువీచికలను ఎలా వినాలో కూడా మనకు తెలియదు.

దేనినైనా సమర్థిస్తూనో ఖండిస్తూనో వున్నప్పుడు సుస్పష్టంగా చూడలేము. మనసు అదేపనిగా వాగుతూ వుంటే కూడా స్పష్టంగా చూడలేము. అటువంటప్పుడు 'ఉన్నది ఏదో' దానిని చూడలేము. మనలను గురించి మనమే ఏర్పరచుకున్న, పైకి ప్రదర్శిస్తున్న వాటినే మనం చూస్తాం. మనలో ప్రతి ఒక్కరికీ మనం ఇలా వున్నామనో, అలా వున్నామనో లేదా ఎలా వుండాలని మనం అనుకుంటున్నామో అదో – ఆ మనోచిత్రం ఒకటి వుంటుంది. అసలు మనం నిజంగా ఏమిటో అనేది చూడకుండా ఆ మనోబింబం, ఆ చిత్రపటం అడ్డుతగులుతుంది.

దేనినైనా సరే, ఊరికే సరళంగా చూడటం మహా కష్టం. ప్రపంచంలోని అతి కఠినమైన అంశాల్లో అదొకటి. ఎందుకంటే మన మనసులు చాలా సంక్లిష్టంగా తయారయాయి. సారళ్యత అనే గుణాన్ని మనం పోగొట్టుకున్నాం. నేను చెప్తున్నది ధరించే దుస్తులు, తినే ఆహారం వంటి విషయాలలో సారళ్యత కాదు. ఆ నిరాడంబరత గురించి కాదు. ఒక గోచిపాత ధరించడమో, ఉపవాసాలుండటము, ఎంతకాలం నిరాహార దీక్ష పూనగలమో నిరూపించడం వంటి పరిణతి లేని వెఱ్ఱివేషాలూ కాదు. కొందరు సాధుమహరాజులు ఇటువంటివి సాధన చేస్తుంటారు. నేను మాట్లాడుతున్నది – ఏ భయమూ లేకుండా విషయాలను సూటిగా చూసే సారళ్యతను గురించి. మనం అసలు నిజంగా ఏమిటో దాని వైపు ఏ వక్రీకరణా లేకుండా పరికించి చూడగల సారళ్యత. అబద్ధం చెప్తున్నప్పుడు నేను అబద్ధం చెప్తున్నాను అని అనడం. అది దాచి వుంచడమో, దాని నుండి తప్పించుకోవాలని ప్రయత్నించడమో కాదు.

## దూరాలకు వెళ్ళాలంటే దగ్గరతో ఆరంభించాలి

మీ మనసును అర్థంచేసు–కోవాలనుకుంటుంటే కనుక మీ ఆలోచనలను నెమ్మదింప చేయాలి. ఆలోచనలను ఆపివేయడం కాదు. ఆలోచనలను అధ్యయనం చేయాలంటే, పూర్తిగా చివరి వరకు వాటి వెంట వెళ్ళి చూడాలంటే వాటి వేగాన్ని తగ్గించాలి. ఇది చేయడానికి నేనొక సలహా కూడా సూచించాను. ప్రతి ఒక్క ఆలోచనను – మనోభావాన్ని కాగితం మీద రాయండి. అన్ని ఆలోచనలను, మనోభావాలను రాయాలంటే అసాధ్యమే. అవి లెక్కకు మిక్కిలిగా వచ్చి పడుతూ వుంటాయి. అయితే, ప్రతి రోజూ కొన్ని కొన్నయినా రాసి పెడ్తూ వుంటే త్వరలోనే మిమ్మల్ని మీరు తెలుసుకోవడం ఆరంభమవుతుంది. మీ చేతనలో వున్న అనేక పొరల గురించి, వాటి మధ్యగల పరస్పర సంబంధాలు, పరస్పర ప్రతిస్పందనలను గురించి ఎరుక కలగడం మొదలవుతుంది. ఇటువంటి ఎరుక నిజానికి చాలా కష్ట సాధ్యం. కానీ, దూరాలకు వెళ్ళాలంటే దగ్గరతో ఆరంభించాలి కదూ.

**(ఒహాయి, 1944, 8 వ ప్రసంగం)**

అంతేకాకుండా, మనలను మనం అర్థంచేసుకోవాలంటే అశేషమైన వినమ్రత అవసరం. 'నేను నాకు తెలుసు' అని అనడం మొదలు పెట్టారంటే మీ గురించి మీరు నేర్చుకోవడం ఆపివేశారనమాట. లేదా, 'నా గురించి నేర్చుకోవడానికి ఏమున్నది కనుక. నేను అంటే కేవలం ఒక జ్ఞాపకాల మూట. ఊహాల, అభిప్రాయాల, అనుభవాల, సంప్రదాయాల మూటను నేను – అంతే' అని కనుక అంటే కూడా మీరు మీ గురించి నేర్చుకోవడం ఆపివేసినట్లే. ఏదైనా సాధించాను అని మీరు అనుకోగానే ఇక మీలో అమాయకత్వం, వినమ్రత అనే గుణాలు లుప్తమై పోతాయి. ఏదో ఒక తీర్మానానికి వచ్చినా, పూర్వపు జ్ఞానంతో – సమాచారంతో పరీక్షించడం ఆరంభించినా ఇక మీరు లాభం లేదు. ఎందుకంటే పాతవాటిని తీసుకొనివచ్చి ఇప్పుడు సజీవంగా వున్న ప్రతిదానినీ వాటి పరంగా అనువదించు కుంటున్నారు. అలా కాకుండా, మీరు దేనిపైనా నిలబడకుండా, ఏదీ నిశ్చయం చేసుకోకుండా, సాధించినది ఏదీ లేకుండా వుంటే అప్పుడు చూడటానికి, అందుకోవడానికి స్వేచ్ఛ వుంటుంది. స్వేచ్ఛతో చూస్తున్నప్పుడు ప్రతిదీ నిత్యనూతనంగా వుంటుంది. తన పైన తనకు నమ్మకం వున్న మనిషి జీవచ్ఛవం.

అయితే, పుట్టిన క్షణం నుంచి మరణించే వరకు మన మనసులను ఏదో ఒక ఫలానా సంస్కృతి 'నేను' అనే సంకుచితమైన నమూనాలోకి రూపు దిద్దుతూ వుంటే అప్పుడు చూడటానికి, నేర్చుకోవడానికి మనకు స్వేచ్ఛ ఎలా వుంటుంది? శతాబ్దాల తరబడి ఈ జాతీయభావాలు, కులాలు, వర్గాలు, సంప్రదాయాలు, మతాలు, భాష, విద్యావిధానము, సాహిత్యము, కళలు, ఆచారాలు, రీతిరివాజులు, రకరకాల ప్రచారవాదాలు, ఆర్థిక ఒత్తిడులు, మనం తినే ఆహారము, మనం నివసిస్తున్న ప్రాంతపు శీతోష్ణ స్థితి, మన కుటుంబాలు, మన స్నేహితులు, మన అనుభవాలు మనలను

నిబద్ధీకృతం చేస్తున్నాయి. ఇంకా ఎన్నో ఇతర ప్రభావాలు వున్నాయి. కాబట్టి ప్రతి సమస్యకూ మనం ఇచ్చే ప్రతిస్పందనలు మన ఈ నిబద్ధతకు లోనై వుంటాయి.

మీరు నిబద్ధీకరణకు లోనై వున్నారని మీకు తెలుసా ? ప్రప్రథమంగా మీకు మీరు వేసుకోవలసిన ప్రశ్న ఇదీ. ఈ నిబద్ధత నుండి ఎలా విముక్తం చెందాలి అనే ప్రశ్న కాదు. ఏనాటికీ కూడా మీరు విడుదల పొందలేక పోవచ్చు. 'నేను విముక్తి పొంది తీరాలి' అని కనుక మీరు అంటే మరొక రకమైన నిబద్ధతకు చెందిన, మరొక రకమైన ఉచ్చులో పడిపోవచ్చు మీరు. నిబద్ధతకు లోనయి వున్నారు అనే ఎరుక మీకు వున్నదా ? ఒక చెట్టు వైపు మీరు చూస్తున్నప్పుడైనా సరే, ఆ చెట్టును చూసి, 'ఇది ఒక ఓకు వృక్షం' లేక 'ఇది ఒక మర్రిచెట్టు' అని మీరు అంటుంటే ఆ చెట్టుకు మీరు ఆ పేరు పెట్టడం మీ వృక్షశాస్త్ర పరిజ్ఞానం. మిమ్మల్ని ఆ పరిజ్ఞానం – ఆ పేరు పెట్టడం ఏ రకంగా నిబద్ధులను చేసిందంటే, ఆ చెట్టును సూటిగా చూడకుండా మీకు ఆ చెట్టుకు మధ్య ఆ మాట – ఆ పేరు అడ్డంగా నిలబడుతున్నది. ఆ చెట్టుకు సన్నిహితంగా రావాలంటే, దానిని స్పృశించాలంటే మీ చేతితో ఆ చెట్టును తాకాలి. కానీ చెట్టును స్పృశించడంలో పేరు ఏమాత్రం తోడ్పడదు.

మీరు నిబద్ధులై వున్నారని మీకు ఎలా తెలుస్తుంది ? అది మీకు ఎవరు చెప్తారు ? మీకు ఆకలి వేస్తున్నది అని ఎవరు చెప్తారు? ఆకలి అనే ఒక విషయం గురించి కాదు. మీకు ఆకలి వేస్తున్నది అనే ఆ వాస్తవం గురించి. అదేవిధంగా, మీరు నిబద్ధీకృతులై వున్నారు అనే నిజమైన వాస్తవాన్ని మీరు ఎలా కనిపెడతారు ? ఒక సమస్యకో ఒక సవాలుకో మీరు చూపే ప్రతిచర్య ద్వారానే కదూ ? ప్రతి సవాలుకూ కూడా మీ నిబద్ధీకరణకు ఆనుగుణంగా మీరు ప్రతిస్పందిస్తారు. మీ నిబద్ధీకరణ లోపభూయిష్టం కాబట్టి మీ ప్రతిచర్యలో కూడా లోపాలు వుంటాయి. సమర్థవంతంగా వుండదు.

ఈ ఎరుక మీలో వచ్చినప్పుడు, జాతిమతాలు, సంస్కృతి చేసిన ఈ నిబద్ధీకరణ ఒక చెరసాలలో వున్నటువంటి భావాన్ని మీలో కలిగిస్తుంది కదూ ?

ఏదో ఒక రకం నిబద్ధతను తీసుకోండి. జాతీయవాదాన్ని తీసుకోండి. చాలా లోతుగా, చాలా పరిపూర్ణంగా దాని గురించి ఎరుకగా అవండి. అది మీకు సంతోషం కలగజేస్తున్నదా లేక దానికి వ్యతిరేకంగా మీరు తిరగబడుతున్నారా అనేది చూడండి. దానికి వ్యతిరేకంగా తిరగబడుతుంటే కనుక మొత్తం నిబద్ధతను అంతటినీ ఛేదించుకొని బయట పడాలనుకుంటున్నారా లేదా అనేది చూడండి. మీ నిబద్ధతలో మీరు తృప్తిపడిపోయి వుంటే కనుక ఇక దీనిని గురించి మీరేమీ చేయరు అనేది స్పష్టం. కానీ ఆ ఎరుక కలిగినప్పుడు మీలో అసంతృప్తి చోటుచేసుకుంటే ఆ నిబద్ధత లేకుండా ఎప్పుడూ ఏదీ చేయడం లేదని గ్రహిస్తారు. ఒక్కసారి కూడా. అందుచేత మీరు ఎప్పుడూ గతంలో వృతప్రాయులతో జీవిస్తుంటారు.

సుఖమూ సంతోషమూ కొనసాగడంలో గాని, బాధను తప్పించుకోవడంలో గాని సంఘర్షణ జనించినప్పుడు మాత్రమే మీరు ఎలా నిబద్ధులై వున్నారో మీకు తెలుస్తుంది. మీ చుట్టూ అంతా సంతోషమయంగా వున్నప్పుడు – మీ భార్య మీతో ప్రేమగా వుంటుంది, మీకూ మీ భార్యంటే ప్రేమ, మీకు మంచి ఇల్లు వున్నది, పిల్లలు బుద్ధిమంతులు, డబ్బు పుష్కలంగా వున్నది – అటువంటప్పుడు మీ నిబద్ధీకరణ గురించి మీకు ఎరుక వుండనే వుండదు. అయితే ఏదైనా అంతరాయం వచ్చిందంటే – మీ భార్య మరొకరి వైపు చూసినా, మీరు డబ్బు పోగొట్టుకున్నా, యుద్ధం పైబడబోతున్నా, మరో రకమైన బాధ గాని, ఆందోళనగాని వచ్చి పడినా – అప్పుడు మీరు నిబద్ధీకృతులై వున్నారని మీకు తెలుస్తుంది. ఏదో ఒక అలజడిని ఎదుర్కొనడానికి ప్రయాస పడుతున్నప్పుడు కాని, బహ్యామైన లేదా అంతర్గతమైన ఆపదనుండి మిమ్మల్ని రక్షించుకోవాలని ప్రయత్నిస్తున్నపుడు కాని మీరు నిబద్ధీకృతులై వున్నారని మీకు తెలుస్తుంది. మనలో చాలామంది చాలా తరచుగా అలజడికి లోనవుతునే వుంటారు కాబట్టి – ఆ అలజడి పైపైనది అవచ్చు, లోలోపలి లోతుల్లోనూ అవచ్చు – అసలు ఆ అలజడే మనం నిబద్ధీకృతులమై వున్నామని సూచిస్తుంది. ఒక పెంపుడు జంతువును ముద్దు చేస్తున్నంతసేపు అది మంచిగానే ప్రతిస్పందిస్తూ వుంటుంది. అయితే ఏమాత్రం విరోధం చూపినా ఆ జంతువులోని సహజస్వభావమైన దౌర్జన్యం – హింస బయటపడతాయి.

జీవితం గురించి, రాజకీయాలు, ఆర్థిక పరిస్థితుల గురించి, ప్రపంచంలో వున్నవాటి గురించే కాకుండా మనలోనే వున్న భయానక స్థితిగతుల గురించి, పాశవికత, దుఃఖం గురించి మనం అలజడి చెందుతూ వుంటాం. దీని ద్వారా మనం ఎంత విపరీతంగా, ఎంత సంకుచితంగా నిబద్ధీకరణకు లోనయివున్నామో గ్రహిస్తాం. సరే, మనం అప్పుడు ఏం చేయాలి? ఈ అలజడిని ఆమోదించి దానితోనే జీవిస్తూ వుండిపోదామా ? చాలా మంది చేసేది అదే. వెన్నునొప్పి వుంటే దానికి అలవాటై బ్రతుకుతున్నట్లుగానే వుండిపోవడమా ? దానితో సర్దుకొని పోవడమా ?

మనందరిలోను ఒక సామాన్య లక్షణం వున్నది. ఎలా వున్నా సరే సరిపెట్టుకొని పోవడం. దానికి అలవాటు పడిపోవడం. దోషం పరిస్థితులది అని అంటూ పరిస్థితులని నిందిస్తుంటాం. 'అబ్బ ! పరిస్థితులు సరిగ్గా వుంటే నేను ఇంకోలా వుండేవాడిని' అంటుంటాం. 'నాకు కనుక అవకాశం లభిస్తే నా ప్రతిభ తెలుస్తుంది' అంటాం. 'నాకు అన్యాయం జరిగింది. అందుకే ఇలా చితికిపోయాను' అంటాం. మనకు వచ్చిన ఒడిదుడుకులన్నింటికీ ఇతరులు కారణమని వారి మీద దోషం వేస్తాం. లేదా అంటే పరిసరాల పైన, ఆర్థిక స్థితిగతుల పైన నెపం వేస్తాం.

మనలో కలిగిన అలజడికి మనం కనుక అలవాటు పడిపోతే అర్థం ఏమిటంటే మనసు మందకొడిగా అయిపోయిందన మాట. ఇది ఎలాగంటే మన చుట్టూ వున్న సౌందర్యానికి అలవాటు పడిపోయాక ఇక ఆ సౌందర్యాన్ని మనం గమనించనే గమనించం కదూ. దేనినీ పట్టించుకోకుండా అయినకొద్దీ మనం ఇంకా ఇంకా కరకుగా నిర్దాక్షిణ్యంగా అయిపోతాం. మనసు కూడా ఇంకా ఇంకా మొరటుగా తయారవుతుంది. దీనికి అలవాటు పడిపోలేక పోతే కనుక దాని నుంచి తప్పించుకొని పారిపోవాలని ప్రయత్నిస్తాం. ఏదో రకమైన మాదక ద్రవ్యాలు తీసుకోవడమో, ఏదో ఒక రాజకీయ పక్షంలో చేరడమో, అరచి కేకలు పెట్టడమో, రచనలు చేయడమో, ఫుట్‌బాల్ ఆట చూడటానికి వెళ్ళడమో, గుడికో చర్చికో వెళ్ళడమో చేస్తాం. లేదా మరేదో రకమైన వినోద కార్యక్రమాన్ని ఎన్నుకుంటాం.

నిజంగా వున్న అసలు వాస్తవాల నుండి మనం ఎందుకు తప్పించుకొని పారిపోతాం ? మరణం అంటే మనకు భయం. మరణాన్ని ఒక ఉదాహరణగా మాత్రమే తీసుకుంటున్నాను. మరణం గురించి రకరకాలైన అనేక సిద్ధాంతాలు, ఆశలు, విశ్వాసాలు కల్పించుకుంటాం. వీటి ద్వారా మరణం అనే వాస్తవానికి ఒక మారు వేషం వేసి మాయపుచ్చుకుందామని చూస్తాం. అయితే ఆ వాస్తవం అక్కడే అలాగే వుంటుంది. ఒక వాస్తవాన్ని అర్థం చేసుకోవాలంటే దాని వైపు పరికించి చూడాలి. దానికి దూరంగా పారి పోకూడదు. మనలో చాలామందికి జీవితమన్నా భయమే, మరణం అన్నా భయమే. పదిమంది ఏమంటారో అనే

భయం. ఉద్యోగం పోతుందేమో, మన భద్రత కోల్పోతామేమో అనే భయం. ఇంకా ఇటువంటి వందలాది భయాలు వున్నాయి. సూటిగా ఒక్క ముక్కలో చెప్పాలంటే – మనం భయపడుతూ ఉంటాము. ఏదో ఫలానా దానిని గురించి భయపడటం కాదు. మనకు భయం. ఇప్పుడు ఈ వాస్తవాన్ని సూటిగా ఎందుకు ఒప్పుకోము ?

వర్తమానంలో మాత్రమే మనం ఒక వాస్తవాన్ని ఎదుర్కొనగలుగుతాం. కానీ మీరు వాస్తవాన్ని వర్తమానంలో వుండనివ్వడం లేదు గదా. వాస్తవం నుండి ఎప్పుడూ తప్పించుకొని పారిపోతుంటారు గదా. అందుచేత సూటిగా వాస్తవాన్ని ఎదుర్కోవడం లేదు. ఎంత విస్తారమైన పలాయనాల జాలాలను అల్లుకొని అలవరచుకున్నామంటే ఇక ఎప్పటికీ తప్పించుకొని పారిపోవడం అనే అలవాటులో నుండి బయట పడలేనంతగా చిక్కుకొని పోయాం.

సరే, మీలో ఏమాత్రం సున్నితశీలత వున్నా, ఏమాత్రం గంభీరత వున్నా మీ నిబద్ధీకరణను గురించిన ఎరుక కలుగుతుంది. ఎరుక కలగడమే కాకుండా దీని ఫలితంగా జరిగే హాని గురించి కూడా తెలుస్తుంది. ఈ నిబద్ధీకరణ ఎటువంటి ఘోర దౌర్జన్యాలకు, విద్వేషాలకు దారితీస్తుందో కూడా తెలుస్తుంది. ఈ మీ నిబద్ధీకరణ ఇంత ప్రమాదహేతువని మీరు గ్రహించాక కూడా ఎందుకని మీరు చర్య తీసుకోవడం లేదు ? మీ సోమరితనం కారణమా ? సోమరితనము అంటే శక్తి లేకపోవడం. మీకే గనుక భౌతికమైన ఒక ఆపద ఎదురవుతే, ఉదాహరణకి మీ దారిలో ఒక పాము ఎదురైతే లేదా కొండ అంచుకి అడుగు వేసినట్లయితే లేదా అగ్నిప్రమాదం ఎదురైతే అప్పుడు శక్తి లేకపోవడం అనేది వుండదు. మరి ఈ విషయంలో – మీ నిబద్ధీకరణ మహా ప్రమాదకారి అని మీరు గ్రహించినప్పుడు ఎందుకని చర్య తీసుకోరు ? జాతీయవాదంవల్ల మీ భద్రతకు ప్రమాదం వాటిల్లుతుందని చూశాక మీరు చర్య తీసుకుంటారా లేదా ?

దీనికి సమాధానం ఏమిటంటే మీరసలు గ్రహించడం లేదు. జాతీయవాదం మిమ్మల్నే నాశనం చేస్తుందని ఒక విశ్లేషణ ద్వారా – అంటే ఒక మేధోప్రక్రియతో మీరు చూసి వుంటారు. అయితే అందులో భావోద్వేగం వుండదు. భావోద్వేగం వున్నప్పుడు మాత్రమే మీరు ప్రాణశక్తితో పనిచేస్తారు.

మీ ఈ నిబద్ధీకరణ వలన కలిగే అపాయాన్ని కేవలం ఒక మేధోజనిత భావంగా మాత్రమే మీరు చూస్తే అప్పుడు దీనిని గురించి ఏమీ చేయనే చేయరు. ఒక అపాయాన్ని, హానిని – అది కేవలం ఒక భావన మాత్రమే అని కనుక మీరు తీసుకుంటే, అప్పుడు ఆ భావనకు చర్యకు మధ్య సంఘర్షణ ఏర్పడుతుంది. ఈ సంఘర్షణ వల్ల మీ శక్తిని కోల్పోతారు. నిబద్ధీకరణను, దాని వలన కలిగే హానిని ఒక్కసారిగా ఒకే ఒక క్షణమాత్రంలోనే చూసినప్పుడు మాత్రమే – కొండ చిట్టచివరి అంచును చూసినట్టుగా చూసినప్పుడు మాత్రమే మీరు చర్య తీసుకుంటారు. అందుచేత చూడటమే చర్య తీసుకోవడం అవుతుంది.

మనలో చాలామంది సావధానత అనేది లేకుండా పరధ్యాసగానే, ఆలోచనా రహితంగా ప్రతిచర్యలు జరుపుతూ జీవితం గడిపేస్తూ వుంటారు. పుట్టిపెరిగిన వాతావరణానికి అనుగుణంగా మనం బ్రతుకుతుంటాం. ఇటువంటి ప్రతిచర్యల వలన మన బంధనాలు ఎక్కువైపోయి మరింత నిబద్ధీకరణకు లోనవుతాం. అయితే, ఈ మీ నిబద్ధీకరణ ఎడల మీ సంపూర్ణ సావధానతను చూపుతే కనుక గతం నుండి మీరు పూర్తిగా విముక్తమై పోతారని మీరే చూడగలుగుతారు. గతం మీ నుండి అత్యంత సహజంగా రాలి పడిపోతుందని మీరే చూస్తారు.

**('ఫ్రీడం ఫ్రమ్ ద నోన్' నుండి;**
**పుటలు 19–30)**

**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM IV**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Krishnamurthi Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months (August, December and April) |
| 3. Printer's name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics Offset Press<br>27, Neelakanda Mehta Street,<br>T. Nagar<br>Chennai - 600 017. |
| 4. Publisher's name | : | Dr. V. Aravind |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Anugraha<br>Flat No.2,<br>Old No. 26, New No. 51,<br>Fourth Trust Cross Street,<br>Mandavelli<br>Chennai - 600 028. |
| 5. Editor's Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road,<br>Chennai - 600 028. |
| 6. Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one per cent of the local capital. | : | Krishnamurti Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |

I, Dr. V. Aravind, hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

(V. Aravind)

*Published in August, December, April*
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL / 2006 / 19442*

*PERIODICAL*

*If undelivered please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803 / 24937596
E-mail : publications@kfionline.org
Websites : www.kfionline.org / www.jkrishnamurti.org

*Published by Dr. V. Aravind on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27, Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*